

ఎమ్మెల్సీ స్థానాలకు 31 నామినేషన్లు

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆరు ఎమ్మెల్సీ స్థానాలకుగాను 21 మంది అభ్యర్థులు 31నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం స్వతంత్ర అభ్యర్థులే అత్యధికంగా నామినేషన్లు వేశారు. 20 మంది పురుషులు 29 నామినేషన్లు, ఒక మహిళ రెండు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ మద్దతుతో ఒకరు, స్వతంత్రులుగా 20 మంది నామినేషన్లు సమర్పించారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి ఈసీ నింగరాజును మార్చారు. ఇదే స్థానంలో జేడీఎస్ అభ్యర్థిగా మైసూరుకు చెందిన వివేకానందను ఎంపిక చేశారు. మైసూరుకు చెందిన వివేకానంద కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో జంగిల్‌రిసార్టు చైర్మన్‌గా వ్యవహరించారు.

ఘాట్లు... ప్రమాద ఘంటికలు..!

- రాష్ట్రంలో ఏడు ఘాట్ రోడ్లపై ఏటా సమస్యే
- దెబ్బతింటున్న రైల్వేట్రాక్‌లు
- విరిగిపడుతున్న కొండచరియలు
- శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలం


ఆగుంబె ఘాట్ రోడ్డు

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం భిన్నమైన ప్రకృతి వనరులు కల్గినది. అటవీ ప్రాంతాలు, కొండలు, నదులు, వాగులు సరస్సులు ఉన్నా సుదీర్ఘమైన రహదారులు ఉన్నాయి. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఘాట్ రోడ్లు ప్రమాదఘంటికలుగా మారుతున్నాయి. ప్రధానంగా బెంగళూరు - మంగళూరు జాతీయ రహదారిపై జూన్ నుంచి నవంబరు దాకా ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి కొనసాగుతోంది. రాష్ట్ర రాజధాని బెంగళూరు నుంచి తీరప్రాంత మహానగరం మంగళూరుకు ఉండే ప్రధాన రహదారిపై ప్రయాణికుల వాహనాల కంటే అధికంగా సరుకు, ఇంధనం రవాణా అత్యధికంగా సాగుతుంది. రెండు నెలలకుపైగా మండుటెండలు కొనసాగగా నైరుతి ముందస్తు వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. మరో రెండు మూడు వారాలలోనే నైరుతి రుతుపవనాల ప్రభావం రాష్ట్రంపై చూపనుంది. పశ్చిమకనుమల శ్రేణి రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో రోడ్ల మార్గమే కాకుండా రైల్వే ట్రాక్‌లు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఈ మార్గంలో సమస్య ఉన్నా శాశ్వత పరిష్కారం సాధించలేకపోతున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఘాట్‌లలో శిరాడి 26 కిలో మీటర్లు, చార్మాడి 25 కి.మీ., సంపాజి 17, బిసిలె 12, ఆగుంబె 11, బాళెబరె 14, నిట్టూరు 16 కిలోమీటర్ల మేర ఘాట్‌లు ఉన్నాయి. వర్షాకాలం వస్తే కొండచరియలు విరిగిపడ్డం, భారీ చెట్లు నేల కూలడం నిత్యకృత్యం అవుతుంటుంది. ఎంతోమంది కొండచరియలు విరిగి పడిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఈ మార్గంలో వర్షాకాలం ప్రయాణించాలంటే ఎప్పుడు ఎక్కడ నిలిచిపోవాల్సి వస్తుందోననే భయం కూడా ఉంది. సంపాజి, బిసిలె, చార్మాడి, ఆగుంబె, బెళెబరె, నిట్టూరు ఘాట్‌ల మీదుగానే తీరప్రాంత జిల్లాలతోపాటు మలెనాడు ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని దక్షిణప్రాంతానికి ప్రధానమార్గం ఉంది. రోజూ ఈ ఘాట్‌ల మీదుగానే 40వేలకుపైగా వాహనాలు సంచరిస్తాయి.

శిరాడి అంటేనే ప్రమాదకరం

తొమ్మిదేళ్లక్రితం ప్రారంభమైన శిరాడిఘాట్ అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. సంపూర్ణంగా కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఈ ఘాట్ పొడవునా 250కు పైగా బ్రిడ్జిలు, మోరీలు ఉన్నాయి. వీటికి అడ్డుగోడలు నిర్మించాల్సి ఉంది. చతుష్పథ (నాలుగు లేన్)ల రహదారి నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగి ఐదారు దశాబ్దాలు పూర్తి కావడంతో సమగ్రంగా నిర్మాణాలు జరపాల్సి ఉంది.

చార్మాడి పొడవునా మలుపులు

చార్మాడి ఘాట్ పొడవునా మలుపులే ఉంటాయి. అత్యంత ఎత్తయిన ఘాట్ ఇది. మంగళూరు - విల్లుపురం జాతీయ రహదారిపై చార్మాడి తగ్గు ప్రదేశం నుంచి మలయమారుత వరకు 25 కిలోమీటర్ల మేర ఘాట్ ఉంది. ఇందులో చిక్కమగళూరు పరిధిలో 13.8 కిలోమీటర్ల ఘాట్ అత్యంత ప్రమాదకరమైంది. 11 మలుపులు ఉన్నాయి. అన్నప్పకొండపై ఓ మలుపులో భారీ వాహనాలు ముందుకు కదలడం పెను సవాల్‌గా ఉంటుంది. ఈ మార్గంలో అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరం ఉంది.

అసంపూర్ణ రహదారి.. ఆగుంబె ఘాట్

ఆగుంబె ఘాట్ మలెనాడు, తీరప్రాంతాల ప్రధాన రహదారికి అనుబంధంగా ఉంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ మార్గం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. వర్షాకాలంలో చెట్లు కూలడం, రాళ్లు జారడం వంటి సంఘటనలు కొనసాగుతుంటాయి. శివమొగ్గ దక్షిణ కన్నడ జిల్లాల మధ్య ఉండే ఈ రహదారి, శివమొగ్గ - దావణగెరె, చిక్కమగళూరు, చిత్రదుర్గ జిల్లాలకు కీలకమైన రహదారి. సోమేశ్వర వన్యజీవుల అభయారణ్యంగా ఉండే ఈ ప్రాంతాన్ని 2014లో జాతీయ రహదారిగా ప్రకటించారు. ఇప్పటి వరకు రూ.30 కోట్లు ఖర్చు చేసినా సంపూర్ణంగా రహదారి నిర్మాణం కాలేదు. 17 కిలోమీటర్ల మేర ఉండే సంపాజి ఘాట్ అత్యంత సుందరంగా ఉండే రెండు లేన్‌ల మార్గమైన జోడుపాళ, మన్నంగేరి, కట్టోజి ప్రాంతాలు ప్రమాదాల స్పాట్‌లుగా ఉన్నాయి. 12 కి.మీ. కల్గిన బిసిలె ఘాట్ రోడ్డు పనులు పూర్తయినా వర్షాకాలంలో చెట్లు కూలుతుంటాయి. 14 కి.మీ. బాళెబరె ఘాట్ కుందాపుర - సిద్దాపుర - శివమొగ్గలకు అనుబంధమైన హాలికల్‌ఘాట్‌లో ఉంది. ఇక్కడ ఏటా వర్షాకాలంలో సమస్య తీవ్రమవుతుంటుంది. 16 కిలోమీటర్ల పొడవునా ఉండే నిట్టూరు ఘాట్ కుందాపుర - హెమ్మాడి - నిట్టూరు - హొసనగర - శివమొగ్గల మార్గాల మీదుగా వెళ్లే కీలకమైన రహదారిపై వర్షాకాలంలో చెట్లు నేల కూలుతుంటాయి.


చార్మాడిఘాట్,


శిరాడిఘాట్

పరిషత్ ఎన్నికలపై పెన్‌డ్రైవ్ ప్రభావం ఉండదు

- జేడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి భోజేగౌడ



బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ వివాదం పరిషత్ ఎన్నికలపై ఉండదని బీజేపీ-జేడీఎస్ అభ్యర్థి భోజేగౌడ తెలిపారు. బుధవారం ఉడుపిలో మీడియాతో మాట్లాడుతూ నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తున్నానని, ఓటర్లు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. పెన్‌డ్రైవ్ అంశం మహిళలకు సంబంధించినదని, రహస్యంగా విచారణ జరగాలని తెలిపారు. వాటిని రాజకీయ నేతలు, ఇతరులు బహిరంగం చేయడం సరికాదన్నారు. పోలీస్ స్టేషన్, సీఐడీ, సిట్ ఇన్‌కెమెరా ప్రొసీడింగ్స్ ఎక్కడ చేపట్టిందని ప్రశ్నించారు. పిల్లలకు, భావితరాలకు రహస్యమనేది లేకుండా బహిర్గతం చేస్తున్నారని, ఇది ససరికాదని తెలిపారు. ఈ విషయంలో సీఎం, డీసీఎం సరైన మార్గంలో నిర్ణయాలు తీసుకోవడం లేదని, నిష్పక్షపాత దర్యాప్తు కోసం సీబీఐకు అప్పగించాలన్నారు. జేడీఎస్‌తో బీజేపీ సంబంధాలు ధృడంగా ఉన్నాయన్నారు. ఫలితాల తర్వాత ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలని అన్నారు.

ప్రజ్వల్‌పై సిట్ నిఘా



బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరుకు వచ్చే విమాన టిక్కెట్‌ను రద్దు చేసుకోవడంతో సిట్ భిన్నమైన కోణాలలో నిఘాకు సిద్ధమైంది. బుధవారం 12 గంటలకు మ్యూనిచ్ నుంచి బయల్దేరి అర్ధరాత్రి 12.30 గంటలకు రావాల్సి ఉండేది. అందుకు సంబంధించిన టిక్కెట్‌ను హర్యానా అకల్ ట్రావెల్స్ నుంచి సిద్ధం చేసుకున్నారు. అయితే నాలుగు రోజుల కిందటే టిక్కెట్‌ను రద్దు చేసుకున్నారు. బెంగళూరుకు ఈనెల 3న, 15బుధవారం వచ్చేందుకు టిక్కెట్లు సిద్ధం చేసుకుని రద్దు చేసిన తరుణంలో సిట్ భిన్నమైన కోణాలలో ఆలోచిస్తోంది. ప్రజ్వల్‌కు సంబంధించిన బ్యాంకుఖాతాల లావాదేవీలను పరిశీలిస్తున్నారు. అతడి బ్యాంకు ఖాతాలను పూర్తిగా స్తంభింప చేయనున్నారు. ప్రజ్వల్ జర్మనీకి ఏప్రిల్ 26న వెళ్లారు. విచారణ చేపట్టాక మే 3వ తేదీ నుంచి సిట్ అధికారుల బృందం విమానాశ్రయంలోనే పడిగాపులుపడుతోంది.

ఊరకే మద్దతు అంటున్నారు..!

- ఓటు మాత్రం కమలానికే వేశారు..
- ఫలితాలకు ముందే మాజీమంత్రి ఈశ్వరప్ప నిరుత్సాహం


ఈశ్వరప్ప

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుతూహలం అనిపించిన శివమొగ్గ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక పోలింగ్ ముగిశాక రెబెల్‌గా పోటీ చేసిన ఈశ్వరప్ప స్వరంలో మార్పు వచ్చింది. శివమొగ్గ నుంచి గెలుపొంది ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తానని ఎన్నికలకు ముందు ఈశ్వరప్ప ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిశాక తొలిసారిగా బెంగళూరులో బుధవారం ఓ మీడియాతో మాట్లాడుతూ అందరూ కమలానికి ఓటు వేసి మీకే మద్దతు అంటున్నారని నిరుత్సాహం వ్యక్తం చేశారు. బీజేపీతో తన సుదీర్ఘకాల సంబంధమే ఇండిపెండెంట్‌గా తన ఓటమికి కారణమన్నారు. తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రచారం చేసుకోవడంలో తగినంత మద్దతు సాధించలేకపోయానని అన్నారు. ఈశ్వరప్ప అంటే బీజేపీ... బీజేపీ అంటే కమలమని ప్రజలు భావించారని, ఇదే ఇప్పుడు తనను ముంచిందని అన్నారు. చాలామంది కమలానికి ఓటు వేసి మీకే మద్దతు ఇచ్చామని చెబుతున్నారని తెలిపారు. బీజేపీ తనకు తల్లిలాంటిదని, విడిచి వెళ్లలేనని, తుదిశ్వాస వరకు కొనసాగుతానని అన్నారు. తాను బీజేపీ లోనే ఉన్నానని అన్నారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ తరహాలోనే హైకమాండ్ మిమ్మల్ని వాపసు తీసుకురానుందా అనే ప్రశ్నకు సమాధానంగా బీజేపీ తనను ఎందుకు పిలవాలని, నేను బీజేపీనే ఎవరో వచ్చి నన్ను ఆహ్వానించడం ఏమిటన్నారు. తాను ఎప్పటికీ బీజేపీనే అన్నారు. మిమ్మల్ని పార్టీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు సస్పెండ్ చేశారనే విషయమై అడిగిన ప్రశ్నకు సమాధానంగా విజయేంద్ర ఓ బచ్చా అన్నారు. రాష్ట్రంలో యడియూరప్ప, తాను, అనంతకుమార్, శంకరమూర్తి, రామచంద్రేగౌడ కలసి పార్టీని నిలబెట్టినవారమన్నారు. రాజకీయాల్లో విజయేంద్ర పసికూన అన్నారు.

చలో హాసన్!

- ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి
- ప్రజాసంఘాల కార్యాచరణ

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వివాదంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజాసంఘాలు సిద్ధమయ్యాయి. రాసలీలల పెన్‌డ్రైవ్‌లు బహిరంగమై నెలరోజులకుపైగా కాగా ప్రజ్వల్ దేశం విడిచి 19 రోజులు ముగిసింది. ఇప్పటి వరకు అతడి ఆచూకీని దర్యాప్తు సంస్థ గుర్తించలేదు. బాధిత మహిళలకు తగిన రక్షణ కల్పించలేదని ప్రజాసంఘాలు ఈనెల చివరన చలో హాసన్‌కు సిద్ధమయ్యాయి. ప్రముఖ పోరాట సంఘాల నేతలు, మహిళా సంఘాల నాయకులు, సాహితీవేత్తలు పాల్గొననున్నట్టు సమాచారం. పోరాటంలో వేలాదిమందిని భాగస్వామ్యులను చేయాలని నిర్ణయించారు. బాధితురాలే తప్పు చేసినవిధంగా మారిపోతోందని, మహిళల గౌరవానికి భంగం కలగకుండా దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల కూటమి సంచాలకుడు ధర్మేశ్ తెలిపారు. ఈనెల 18న హాసన్‌లో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజాసంఘాల నేతలు, సాహితీవేత్తలు పాల్గొంటారని అన్నారు. ఇదే సభలోనే హసన్ చలో తేదీ ఖరారు చేస్తామని తెలిపారు.

సమాజ సేవకుడు జేఎస్ రెడ్డి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకుడు జేఎస్ రెడ్డి ఆదర్శప్రాయుడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జేఎస్ రెడ్డి సంస్మరణ సభ ఇందిరానగర క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. జేఎస్ రెడ్డి కుమారుడు భక్తవత్సలంరెడ్డి, కుమార్తె రాధికారెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్మరణ సభకు హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జేఎస్ రెడ్డి తనకు ఎన్నో ఏళ్ల నుంచి మిత్రుడని తెలిపారు. ఆయన సేవా తత్పరుడని కొనియాడారు. ఆయన మృతి వారి కుటుంబానికే కాకుండా సంస్థకు, సమాజానికి తీరని లోటు అన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా చేసిన మంచి పనులు, సేవా కార్యక్రమాలు అందరి హృదయాల్లో శాశ్వతం పేర్కొన్నారు. మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ దగ్గరుండి కార్యక్రమాలు జరిపించినట్టు కుటుంబీకులు తెలిపారు. రాజస్థాన్ మాజీ మంత్రి రాంలాల్, నెల్లూరు ఆదాల ప్రభాకరరెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి బీఎన్ఎస్ రెడ్డి సంస్మరణసభలో మాట్లాడారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, శేఖర్‌రాజుతో పాటు సమితి సభ్యులు, జేఎస్ రెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.



జేఎస్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఎయిర్‌పోర్ట్ రోడ్డులో మితిమీరిన వేగం..!

- నాలుగు నెలల్లో 30 మంది దుర్మరణం

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ రోడ్డులో వేగం అదుపు తప్పుతోంది. త్వరితగతిన విమానాశ్రయానికి చేరుకోవాలనే ఆత్రుత ప్రమాదాలకు దారితీస్తోంది. నాలుగు నెలల వ్యవధిలోనే 30మంది ప్రాణాలు కోల్పోయారు. కెంపాపుర జంక్షన్ నుంచి ఎయిర్‌పోర్ట్‌దాకా 27 కిలోమీటర్ల దూరంలో రెండు ఫ్లై ఓవర్లు ఉండగా రాత్రి పగలు తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ రోడ్డులో 2021లో 239 ప్రమాదాలు చోటు చేసుకోగా 43 మంది మృతి చెందారు. 244 మంది గాయపడ్డారు. 2022లో 278 ప్రమాదాలు చోటు చేసుకోగా 73 మంది మృత్యువాత చెందారు. 247 మంది గాయపడ్డారు. 2023లో 322 ప్రమాదాలు చోటు చేసుకోగా 87 మంది మృతి చెందారు. 278 మంది గాయపడ్డారు. 2024 నాలుగు నెలల వ్యవధిలోనే 110 ప్రమాదాలు జరగ్గా 30 మంది మృతి చెందారు. 111 మంది గాయపడ్డారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వచ్చే వాహనాలకు ప్రమాదాలు తక్కువే అయినా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే సమయంలోనే త్వరితగతిన చేరుకోవాలనే ఆత్రుత ప్రమాదాలకు కారణమవుతోంది. ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపట్టినట్టు జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ తెలిపారు. క్యాబ్ డ్రైవర్లకు ముందస్తు అవగాహన కల్పిస్తున్నారు. 27 కిలోమీటర్ల మార్గంలో నిఘా కోసం 8 హై రెసొల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. 80 కిలోమీటర్ల వేగాన్ని పరిమితం చేశారు. అంతకుమించి వేగంతో వాహనాలు వెళ్తే కేసులు నమోదు చేస్తారు. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఉన్నందున దేశ విదేశాలకు చెందినవారు వస్తుంటారు. ప్రమాదాల వల్ల అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతోంది. ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ప్రమాదాలు నియంత్రించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు జాయింట్ కమిషనర్ ప్రకటించారు.


ఇటీవల జరిగిన ప్రమాదం (ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.59	1,577.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	00	1868
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	00	215
సామర్థ్యం (టీఎంసీలు)	3.41	3.44

ఫసల్ బీమా సొమ్ము స్వాహా

Pradhanmantri Fasal Bima

● రూ.75,91,167 హాంఫట్

● 36మందిపై కేసు నమోదు

ఫసల్ భీమా సొమ్ము మంజూరైన 116 మంది రైతులకు చెందిన సొమ్మును కొందరు ప్రముఖులు కాజేశారు. రైతులకు మంజూరైన రూ.75,91,167 నగదు దారి మళ్లి 36 మంది ప్రముఖుల ఖాతాల్లో ఒకేరోజు జమ కావడం ఎవరినైనా ఆశ్చర్యానికి గురిచేయకమానదు. కేసు ముందుకు సాగకుండా అక్రమార్కులు అడుగడుగునా అడ్డుపడుతూనే వచ్చారు. అయినా అధికారులు ఎట్టకేలకు కేసు దర్యాప్తు చేసి 36 మందిపై కేసు నమోదు చేశారు.

రాయచూరు, మే 15 : 2020-21 సంవత్సరంలో రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా జాలహళ్ళికి చెందిన రైతులు రబీ సీజన్‌లో ఫసల్ భీమా పథకం ద్వారా తమ పంటలకు భీమా చేయించుకున్నారు. వారి పంటలు దెబ్బతినడంతో 273 మంది రైతులకు పరిహారం మంజూరైంది. వీరిలో 116 మంది రైతులకు చెందిన సొమ్మును 36 మంది కాజేశారు. రైతులకు మంజూరైన రూ.75,91,167లు దారి మళ్లి ఆ 36 మందికి ఒకే రోజు వారి ఖాతాలో జమ అయింది. దీంతో పాటు రైతులు తమ భీమా సొమ్ము క్లెయిమ్‌కు సంబంధించి ఒకే రోజు ఒకే ఈ-సేవా కేంద్రం నుంచి రిజిస్ట్రేషన్‌ను చేసుకోవడం, పక్కాగా రసీదులు ఉండడం తదితర వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు ఎట్టకేలకు 36 మంది నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ కేసు నమోదు చేశారు. కాగా కేసులు నమోదైన వారిలో అనేక మంది సమాజంలో ప్రముఖులుగా చెలామణీ అవుతున్నవారే. దీంతో ఈ కేసు 4 సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్నట్టు తెలుస్తోంది. దర్యాప్తులోను అనేక రాజకీయ ఒత్తిళ్లు ఎదురయ్యాయన్న ఆరోపణలు వినిపించాయి. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, విచారణలో కొన్ని సాంకేతిక కారణాలు తలెత్తడంతో కేసు నమోదులో జాప్యం జరిగిందని వివరిస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి : హసిరు సేనల రాష్ట్ర అధ్యక్షుడు

కర్ణాటక రైతు సంఘం హసిరు సేనల రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటీల్ ఈ కేసుపై స్పందిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి మొదలుకొని ఉన్నతాధికారుల జోక్యం వల్లే కేసు ఏళ్ల తరబడి కొనసాగిందని ఇప్పటికైనా నిందితులకు కఠిన శిక్షలు విధించి ఇలాంటి దుర్వినియోగం భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సబ్సిడీ ధరలపై విత్తనాల పంపిణీ



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ బి పాటిల్

సిరుగుప్ప, మే 15: సబ్సిడీ ధరలపై ఈ ఏడు విత్తనాలను పంపిణీ చేస్తామని అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌బీ పాటిల్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ధరపై పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కిలో మిరప, పత్తి, విత్తనాలపై జనరల్ కేటగిరీకి రూ. 8, ఎస్సీ, ఎస్టీలకు రూ. 12లు సబ్సిడీ కల్పిస్తున్నట్లు తెలిపారు. తాలుకాలోని రైతు సంపర్క కేంద్రాల్లో ఈ విత్తనాలను పొందవచ్చునని ఆయన తెలిపారు. కరువు పంట నష్టపరిహారాన్ని త్వరలో రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని ఆయన తెలిపారు.

ఇసుక టిప్పర్‌ల స్వాధీనం

రాయచూరు, మే 15 : కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్‌లను దేవదుర్గ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దేవదుర్గ తాలూకాలోని నదీ తీర గ్రామం గణేకల్ సమీపంలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఇసుక తరలిస్తున్న నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకునే క్రమంలో వాటి డ్రైవర్‌లు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు. అనంతరం గోపాళపూరు గ్రామం వద్ద పెద్ద ఎత్తున అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు అక్కడే ఉన్న రెండు ఎక్సవేటర్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆ సర్కిల్‌కు పూలే పేరుపెట్టాలి..



దుర్గమ్మ దేవాలయ సమీపంలో నిర్మించిన సర్కిల్

బళ్లారి సిటీ, మే 15: బళ్లారి కనక దుర్గమ్మ ఆలయ సమీపంలో నిర్మించిన సర్కిల్‌కు సావిత్రిబాయి పూలే పేరుపెట్టాలని సోషియల్ ఆక్షన్ క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. నగర మహానగర పాలిక కమిషనర్ ద్వారా బుధవారం ఆయన ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో మహాత్మా జ్యోతిబా పూలే సతీమణి సావిత్రిబాయి పూలే బ్రిటీషు పాలనలో స్త్రీల హక్కుల గురించి, సతీసహగమన వ్యవస్థ, వితంతు పునర్వివాహం, స్త్రీపురుషుల సమాన హక్కుల గురించి పోరాడటంలో చాలా ముఖ్యపాత్ర పోషించారన్నారు. మహిళల కోసం మొట్టమొదటి పాఠశాలను స్థాపించిన ఘనత ఆమెదేనని, స్వాతంత్ర్యం కోసం మా దేశం మాహక్కు అనే నినాదంతో పోరాటం చేపట్టిందన్నారు. అన్ని రంగాలలో సాధికారత ఏర్పడిందన్నారు. నగరంలో ముఖ్యమైన సర్కిళ్లకు గడిగిచెన్నప్ప సర్కిల్, హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్, గోపాలస్వామి రోడ్డు, డా.రాజ్‌కుమార్ రోడ్డు లాంటి పేర్లు ఉన్నాయని, వీటికి తోడు ఒక మహిళా సర్కిల్‌ను కూడా నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణ, భాష, శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప, జగన్నాథ్, నారాయణ, వెంకటేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డెంగీపై అవగాహన ర్యాలీ

బళ్లారి సిటీ,మే 15: జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినంలో భాగంగా గురువారం జిల్లా ఆసుపత్రి, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయ ఆవరణ నుండి డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని కంట్రోలర్ డాక్టర్ అబ్దుల్లా తెలిపారు. సమాజంలో డెంగ్యూ జ్వరాన్ని అదుపు చేద్దాం అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



శారదా స్కూలులో పిల్లల కోసం ఏర్పాటైన యోగా శిబిరం

కంప్లి, మే 15 : వేసవి సెలవుల్లో పతంజలి యోగా సమితి 15 రోజుల పాటు కంప్లి పట్టణంలోని శారదా స్కూలులో పిల్లలకు యోగా శిబిరం ప్రారంభించింది. చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ముందుకు రావాలని తాలుకా సంచాలకులు మౌనేష్ తెలిపారు. ఈ శిబిరంలో చిత్రకారుడు నాగప్ప, చంద్రన్న, రామరాజు,డివి సుబ్బారావు, తిప్పేస్వామి, రామలింగయ్య, మూర్తి గౌడ్రు, నాగరత్నమ్మ, నిర్మలమ్మ తదితరులు పాల్గొని పిల్లలకు యోగాలో మెళకువలు నేర్పిస్తున్నారు.

కార్మిక సంఘం అధ్యక్షుడిగా చాంద్ బాషా

బళ్లారి రూరల్, మే 15: బళ్లారి పరిధిలోని కార్మిక గ్రామీణ అధ్యక్షులుగా ఒణిగనూరు చాంద్ బాషాను కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఛానాల్ శేఖర్, జిల్లా అధ్యక్షులు డి కగ్గల్లు శంకర్, గ్రామీణ అధ్యక్షులు పంపన్న గౌడ నేతృత్వంలో బళ్లారి కర్ణాటక రక్షణ వేదిక కార్యాలయంలో సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్మిక జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న అనంతరం పలువురు జిల్లా సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒణిగనూరు ఆంజనేయులు, గ్రామ పంచాయతీ సభ్యులు వెంకటేష్, వీరేష్, దేవరాజు, మోహన్ నాయక్, వాసులింగప్ప, శివమూర్తి, రాజశేఖర్, పలువురు పదాధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన ఫ్లై ఓవర్ పనులు



హొస్పేట వద్ద నూతన గేట్ ద్వారా వెళుతున్న వాహనాలు

కంప్లి, మే 15 : హొస్పేట పట్టణం కంప్లి రోడ్డులో వుండే ఫ్లైఓవర్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ దోవన వెళ్లే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్ని రోజులుగా ఫ్లైఓవర్ పనులు నిలిచిపోవడంతో రైల్వే గేటు పడిన సమయంలో ఫ్లైఓవర్ లేక జనం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారు. గతంలో మంత్రి ఆనంద్ సింగ్ వున్న సమయంలో ఫ్లైఓవర్ పనులపై దృష్టి సారించేవారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోవడంతో ఆ పనులపై ఇతరులెవరూ దృష్టి సారించలేకపోయారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే గవియప్ప ఈ ఫ్లైఓవర్‌పై దృష్టి సారించి అధికారుల దృష్టికి తీసుకురావడంతో తిరిగి పనులను పునః ప్రారంభించారు. ప్రత్యేకించి కొత్త గేటు ఏర్పాటు చేసి పాత గేటు వద్ద పనులను ప్రారంభిస్తున్నారు.

ఘనంగా డీకే శివకుమార్ జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బోయపాటి విష్ణువర్ధన్

బళ్లారిరూరల్, మే 15 : బళ్లారి నగర కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 62వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో బుడా అధ్యక్షులు అంజనేయులు, బోయపాటి విష్ణువర్ధన్, మాజీ మేయర్ రాజేశ్వరితో పాటు కాంగ్రెస్ నాయకులు వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో కుడితిని

కంప్లి, మే 15 : కుడితిని కాలుష్య పట్టణంగా పేరొందింది. జిల్లా పరిధిలో కుడితిని పట్టణం చుట్టూ పెద్ద పెద్ద పరిశ్రమలు ఏర్పడడంతో వాటి నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళి వల్ల పూర్తిగా కుడితిని పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో తాము నిరసనలు చేపట్టామని, అందువలన అప్పట్లో కొద్ది కాలం మాత్రమే పరిశ్రమలకు ఈసీపీఎల్ వినియోగించి దుమ్ము, ధూళిని నియంత్రించారన్నారు. కానీ ఇప్పుడు జిందాల్, ఏసీసీ, కేపీసీఎల్, బీసీపీఎల్, అగర్వాల్, క్యాన్ తదితర ఫ్యాక్టరీల వల్ల కుడితిని పట్టణమంతా కలుషితమైపోయింది. ఎన్నో కుటుంబాలు దుమ్ముధూళి వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో అనారోగ్యం పాలై ఆస్పత్రి పాలయ్యారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు ఫ్యాక్టరీల ద్వారా వెలువడే దుమ్ము ధూళి, పొగను అరికట్టి తాము అనారోగ్యం పాలు కాకుండా కాపాడాలని కుడితిని ప్రజలు కోరుతున్నారు.



కేపీసీఎల్ నుంచి వెలువడుతున్న పొగ

తమిళనాడువాసి హత్య

హిందూపురం, మే 15: తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన సెల్వకుమార్(54) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేశారు. హిందూపురం సమీపంలోని మోతకపల్లి వద్ద మంగళవారం రాత్రి ఈ హత్య జరిగిందని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. సేలంకు చెందిన సెల్వకుమార్ సోదరులు కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపురంలో ఉంటున్నారు. సెల్వకుమార్‌కు మతిస్థిమితం లేదు. దీంతో పరిగి మండలం మోదా సమీపంలోని ఓ ఆశ్రమంలో చేర్పించారు. అతను హిందూపురానికి మంగళవారం వ చ్చాడు. మోతుకపల్లి సమీపంలో హత్యకు గురయ్యాడు. ఆ దారిలో బుధవారం ఉదయం వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సెల్వకుమార్ సోదరుడు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని గుర్తించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అడవిలో నీటి ట్యాంకులు ఎంతో అవసరం

● వీటితోనే మానవ-జంతు సంఘర్షణకు ఫుల్‌స్టాప్

● డిప్యూటీ కన్జర్వేటర్ సందీప్ సూర్యవంశీ

బళ్లారి సిటీ, మే 15: అటవీశాఖ అన్ని అడవుల్లో వ్యూహాత్మక ప్రదేశాల్లో విశాలమైన నీటి తొట్టెలను నిర్మించడంతో తాలూకాలో తొలిసారిగా మనుషులు, వన్యప్రాణుల మధ్య ఘర్షణలు తప్పాయని బళ్లారి రీజినల్ ఫారెస్ట్ డివిజన్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సందీప్ సూర్యవంశీ అన్నారు. సండూరు అడవుల్లోని చిరుతపులి, ఎలుగుబంటి, అడవిపంది, కోతి. నక్క లాంటి జంతువులు వేసవిలో నీటిని వెతుక్కుంటూ మానవ నివాసాల వద్దకు వచ్చినపుడు అనుకోకుండా మనుషులపై దాడి చేసేవన్నారు. అలాంటి దాడులు జరగకుండా ఉండేందుకు అటవీశాఖ ఈ పనిని చేపట్టిందన్నారు. అలాగే ఇలాంటి సందర్భంలో మనుషులు భయపడి జంతువులపై దాడి చేసి వాటిని చంపే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న అటవీ శాఖ సండూర్ తాలూకాలోని ఉత్తర, దక్షిణ మండలాల్లో అనేక నీటి ట్యాంకులను నిర్మించి వాటిని నీటితో నింపిందన్నారు. దీంతో జంతువులన్నీ ఆ ట్యాంకుల్లోని నీటిని తాగి అడవిలోనే ఉంటున్నాయని తెలిపారు. వన్యప్రాణి పరిశోధకుడు డాక్టర్ సమద్ కొత్తూరు నీటి తొట్టెల వద్ద సుమారు 30 కెమెరా ట్రాప్‌లను కట్టి అక్కడికి వచ్చే జంతువుల కదలికలను రికార్డు చేశాడన్నారు. గని ప్రాంతాల చుట్టూ నీటి ట్యాంకులు నిర్మించామని, అన్ని వన్యప్రాణులు ఈ ట్యాంకుల నుండి నీరు త్రాగుతున్నట్లు నమోదయిందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోని వివిధ అటవీ ప్రాంతాల్లో మరిన్ని నీటి ట్యాంకులు నిర్మించ తలపెట్టామన్నారు. అటవీజంతువులు తినే పండ్ల చెట్లను కూడా అధిక సంఖ్యలో పెంచడం ద్వారా అడవుల్లో జీవవైవిధ్యం పెరుగుతుందని సందీప్ సూర్యవంశీ తెలిపారు.



నీటి ట్యాంకు వద్దకు వస్తున్న జింక

నీటిని శుద్ధి చేసుకుని తాగాలి

● రాయచూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్



రాంపూర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే

రాయచూరు, మే 15 : నగరంలోని ప్రజలు కొళాయిల ద్వారి అందించే తాగునీటిని శుద్ధి చేసిన అనంతరమే తాగాలని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ సూచించారు. గణేకల్ రిజర్వాయర్ నుంచి నగరానికి తాగునీరందించే రాంపూర్ జలాశయానికి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం పత్రికలతో మాట్లాడిన ఆయన వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే సమయంలో నిల్వ ఉంచిన నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో తాగునీటి విషయంలో ప్రజలు మరింత జాగ్రత తీసుకోవాలన్నారు. నీటి వృధాను సహితం చేయవద్దని శుద్ధీకరించిన నీటిని సేవించడం ద్వారా రోగాల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

హొసూరు జోన్

చంద్రచూడేశ్వర ఆలయం వద్ద పూడికతీత



ఆలయంలో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

హొసూరు, మే 15: హొసూరు పీపుల్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్ర చూడేశ్వర ఆలయం వద్ద మొక్కలు నాటడం, చెరువుల త్రవ్వకం నిర్వహించారు. ట్రస్ట్ తరఫున ప్రకృతి సంరక్షణ కోసం సుమారు 1000 మొక్కలు నాటి సంరక్షణ చేపట్టారు. అలాగే ఆలయం చుట్టు ఉన్న నీటి వనరులను గుర్తించి పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. ఈ ఆలయం చుట్టు వేపమొక్కలు, అంజీర మొక్కలు, జామ, పనస వంటి వివిధ రకాల మొక్కలు నాటారు. బిందు సేద్యం ద్వారా వాటిని నిర్వహిస్తున్నారు. ధర్మకర్తలు పళనివేల్, శివకుమార్, రాజమాణిక్యం, రాధాకృష్ణన్, మురుగన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మాస్టర్స్ డిగ్రీకి అవకాశం

హొసూరు(కృష్ణగిరి), మే 15: కేంద్ర ప్రభుత్వం మాస్టర్స్, పీహెచ్‌డీ కోసం విదేశాలలో చదువుకునేందుకు ఎంపికైన గిరిజన విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. ఇందుకోసం ఈనెల 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. ఆసక్తిగలవారు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం

హొసూరు, మే 15: హొసూరు రాయకోట రోడ్డులోని ముల్లైనగర్‌లోని గాయత్రి దేవి ఆలయంలో బుధవారం 11వ వార్షికోత్సవ విశేషపూజలు జరిగాయి. తమిళనాడులో వర్షాలు కురవాలని, లోకకల్యాణం కోసం పూజలు జరిపారు. జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా ఎదుర్కొనే ధైర్యం ఇవ్వాలని ప్రజలు, భక్తులు వారి వారి కోర్కెలను కొరుకున్నారు. విద్య, ఐశ్వర్యం, వివేకం, శౌర్యం, వృత్తి, వ్యాపారాలు, కుటుంబం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముల్లై నగర్, శానసంద్రం, నంజుండేశ్వర నగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్ అచీవర్స్ అవార్డుల ఎంపిక కోసం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

హొసూరు(కృష్ణగిరి), మే 15: తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి తరఫున 2023 సంవత్సరానికి గాను గ్రీన్ అచీవర్స్ అవార్డు ఎంపిక కమిటీ సమావేశం కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగింది. కలెక్టర్ కె.ఎం. సరయు నేతృత్వం వహించగా తమిళనాడు గ్రీన్ ఛాంపియన్ అవార్డ్ 2023కు అర్జీలు ఆహ్వానించనున్నారు. పర్యావరణ, అటవీ, పరిరక్షణ అవగాహన కోసం అంకితం చేసిన తమిళనాడులోని 100 మంది వ్యక్తులు లేదా సంస్థలకు గ్రీన్ ఛాంపియన్ అవార్డును ఇవ్వనున్నారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. పర్యావరణ విద్య, పర్యావరణ పరిరక్షణ, హరిత ఉత్పత్తులు, గ్రీన్ టెక్నాలజీకి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనాలు, స్థిరమైన అభివృద్ధి, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నీటి వనరుల రక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా వాయి కాలుష్యం తగ్గింపు, రీసైక్లింగ్ , ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు సంబంధించి పాటుపడిన స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యాసంస్థలు, వ్యక్తులు, స్థానిక సంస్థలు, పరిశ్రమలకు గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రదానం చేసేందుకు గ్రీన్ అచీవర్ ఎంపిక కమిటీ సమావేశం జరిగింది. ఇంతవరకు 8 ధరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థి అమరనాథ్‌ను గెలిపించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి

సిరుగుప్ప, మే 15 : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూన్ 3వ తేదీన జరగనున్న ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నిక నేపథ్యంలో సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమర్‌నాథ్ పాటిల్ రాజకీయంగా ఎంతో నిపుణుడని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించినట్లయితే ఈశాన్య కర్ణాటక అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, సీనియర్ నాయకులు ధరప్ప నాయక్, బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, దొడ్డ ఉలిగప్ప, ఎస్సీ మోర్చ అధ్యక్షులు మైకేల్ వీరేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాలి శంకరప్ప తదితర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర జవానుకు ఘన నివాళులు



వీర జవాను రామకృష్ణ (ఫైల్)

బళ్లారిరూరల్, మే 15 : భారత సైన్యంలో బంగ్లాదేశ్ సరిహద్దులో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో పనిచేస్తూ మే12న వీరమరణం పొందిన బళ్లారికి చెందిన రామకృష్ణకు బళ్లారి వాసులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయాన్ని బుధవారం బళ్లారి నగరంలో మాజీ సైనికులు, బంధువుల ఆధ్వర్యంలో బళ్లారి ఎంజీ సర్కిల్ నుంచి బెంగళూరు రోడ్డు ఏపీఎంసీ, పలు వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అనంతరం స్మశానవాటికకు తరలించారు. మాజీ సైనికులు, అధికారుల నేతృత్వంలో ప్రభుత్వ లాంఛనాలతో గాల్లో కాల్పులు జరిపి అంత్యక్రియలను నిర్వహించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయిన్...

బాబ్ హాక్ (వర్ధంతి)



దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన రాజకీయనేత. లేబర్ పార్టీ నాయకుడు రాబర్ట్ జేమ్స్ లీ హాక్ 1929 డిసెంబరు 9న జన్మించారు. 1983 నుంచి 1991వరకు 23వ ప్రధాన మంత్రిగా వ్యవహరించారు. 1984లో ఒపీనియన్ పోల్‌లో 75శాతంతో అత్యధిక ప్రజాదరణ పొందిన నాయకుడిగా నిలిచారు. లేబర్ పార్టీ అధికారంలో వచ్చేందుకు ఎంతో కృషి చేశారు. వ్యాపార రంగంలో రాణించినట్టుగానే సేవా కార్య క్రమాల్లోనూ ముందంజలో ఉండేవారు. ఆస్ట్రేలియాలో థర్డ్ లాంగెస్ట్ సర్వింగ్ ప్రైమ్ మినిస్టర్‌గా నిలిచారు. 2019 మే 16న కన్నుమూశారు.

సబటిని (పుట్టినరోజు)



అర్జెంటీనా దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారిణి గేబ్రియెలా బీట్రిజ్ సబటిని 1970 మే 16న జన్మించారు. 1980-190ల మధ్య వర్ధమాన క్రీడాకారిణిగా రాణించారు. 41 టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. సింగిల్స్‌లోనూ, డబుల్స్‌లోనూ 3వ ర్యాంకులో కొనసాగారు. 1990 యూఎస్ ఓపెన్, 1988లో స్టెఫీగ్రాఫ్‌తో కలసి వింబుల్డన్ ట్రోఫీ కైవశం చేసుకున్నారు. 2006లో ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. 2017లో జీన్ బరోట్రా స్పోర్ట్స్‌మన్‌షిప్ అవార్డ్, 2018లో అథ్లెట్ రోల్‌మోడల్, 2019లో ఫిలిప్ చార్టిర్ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం యూనిసెఫ్, యునెస్కోలతో కలసి సమాజసేవ అందిస్తున్నారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి

చిలమత్తూరు, మే 15: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను బుధవారం మండల బ్రాహ్మణ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన భారతీయ తత్వవేత్త, వేదాంతి శంకరాచార్యులని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. అటువంటి మహాత్ముడి జయంతి వేడుకలను ప్రతి హిందువు జరుపుకోవాలన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలన్నారు సమాజ హిత కోసం ఆయన కృషి వెలకట్టలేనిదన్నారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

అగళి, మే 15 : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాలలో ఎన్నికల కౌంటింగ్ జరిగే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక మద్యం రవాణా, జూదం, మట్కా, కొత్త వ్యక్తులు సంచారం తదితర వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన బుధవారం ఆలూడి, పీ బ్యాడిగెర, బొమ్మరసనపల్లి తదితర గ్రామాలలో చెక్‌పోస్టులను పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత పరిశీలన

హిందూపురం, మే 15 : ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ మాధవ రెడ్డి పరిశీలించారు. ఆయన బుధవారం నాయనపల్లి వద్ద ఉన్న బిట్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లను పరిశీలించి, వారికి సూచనలు అందించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర సాయుధ బలగాలు ఆర్మీ రిజర్వ్‌డ్ బలగాలు, సివిల్ పోలీసు బలగాలు 24గంటలపాటు మోహరించి ఉంటాయన్నారు. 144సెక్షన్ అమలు లో ఉంటుందన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ సౌకర్యం కల్పించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు ముగిసేవరకు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు. ఎవరైనా అపోహలు సృష్టిస్తే, తప్పుడు సమాచారాలను నమ్మి ఏవైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే అలాంటి వారిపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజక్షన్, రిజర్వ్ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పేదలకు అండగా రోటరీ క్లబ్

విజయపుర, మే 15: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో రోటరీ సంస్థ 50ఏళ్లలో వందలాది ఆరోగ్య శిబిరాలు, వేలామంది పిల్లలకు చదువు, సేవా కార్యక్రమాలతో వందలాది మందికి రోటరీ క్లబ్ అండగా ఉందని 3192 జిల్లా గవర్నర్ వీ శ్రీనివాస్‌మూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సుబ్బమ్మ చిన్నప్ప సముదాయభవనంలో విజయపుర రోటరీ సంస్థ సువర్ణ మహోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ జిల్లా మాజీ గవర్నర్ ఎస్ నాగేంద్ర మాట్లాడుతూ విజయపుర రోటరీ సంస్థ ఐదు అంశాలలో పేరొందిందన్నారు. సర్వీస్, ఫెలోషిప్, డైవర్సిటీ, ఇంటిగ్రిటీ, లీడర్‌షిప్‌లతో సంస్థ ముందుకు సాగుతోందన్నారు. వందలాది కంటి శస్త్ర చికిత్స శిబిరాలు నిర్వహించి వేలాదిమందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఫర్నీచర్, ఇతర సామగ్రిని అందచేశామన్నారు. ఈ సంవత్సరం పలు అంగన్‌వాడీ భవనాలను పునరుద్ధరించామన్నారు. ఇక్కడి సంస్థ సేవా మనోభావానికి ప్రతీకగా 50ఏళ్లుగా సంస్థాపక సభ్యులుగా, అధ్యక్షులుగా కార్యదర్శులుగా పలువురు నేటికీ కొనసాగుతున్నారన్నారు. అధ్యక్షత వహించిన రోటరీ సంస్థ అధ్యక్షురాలు ఏఎం మంజుళ మాట్లాడుతూ సువర్ణ మహోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులను సత్కరించడం, నూతన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి గిరిజాంబ రుద్రేశ్ మూర్తి, సువర్ణ మహోత్సవ యోజనా అధ్యక్షుడు బసవరాజు, సంచాలకులు శైలేంద్రకుమార్, సేవాసంఘం డైరెక్టర్ వీఎస్ రవి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షులు నవ్య నవీన్, జిల్లా ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఆశా శైలేంద్ర, రోటరీ ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి వీసీ సిద్దరాజు తదితరులు పాల్గొన్నారు.



రోటరీక్లబ్ సంస్థాపక సభ్యులకు సన్మానం

వర్షం కోసం ప్రత్యేక పూజలు

శిడ్లఘట్ట, మే 15: శిడ్లఘట్ట పట్టణంలోని జోడి మునేశ్వర స్వామి దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో లోకకల్యాణం, చక్కటి వర్షాలు కురవాలని కోరుతూ విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి డాక్టర్ శివశంకర్ గురూజి నేతృత్వంలో యజ్ఞం, హోమాలు నిర్వహించారు. కారవార, ధర్మస్థళ తదితర ప్రాంతాలలోనూ విశేషపూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యుడు ఆర్ఎస్ఆర్ మనోజ్ పట్టణంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయన్నారు. కారవార ప్రాంతం కాళింగ సంగమ, ధర్మస్థళలోని పచఛ్ప. సదాశివ దేవాలయ సమీపాన నేత్రావతి నది, మృత్యుంజయనది చేరే సంగమ ప్రాంతాలలో శివశంకర గురూజీ హోమాలు చేయించారన్నారు. ఇప్పటికే పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయన్నారు. జోడి మునేశ్వరస్వామి దేవాలయంలోనూ జల హోమం నిర్వహించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో శివశంకర గురూజీ నేతృత్వంలో శిడ్లఘట్టలో ఉత్తమ వర్షాల కోసం హోమాలు కొనసాగుతాయన్నారు.



జోడు మునేశ్వరస్వామి, హోమాల నిర్వహణ ఇలా...

ఐక్యూబ్ ఎలక్ట్రికల్ కొత్త మోడల్స్

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల తయారీలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన టీవీఎస్ సంస్థ ఐక్యూబ్ ఎలక్ట్రికల్ సిరీస్‌లో కొత్త వాహనాలను బెంగళూరులో బుధవారం లాంచనంగా విడుదల చేశారు. మార్కెటింగ్ వైస్‌ప్రెసిడెంట్ సౌరబ్ కపూర్, మార్కెటింగ్ హెడ్ నితిన్ తనేజాలు కొత్త వాహనాల గురించి మాట్లాడుతూ 2.2 కేడబ్ల్యుహెచ్, 3.4 కేడబ్ల్యుహెచ్, 5.1 కేడబ్ల్యుహెచ్ బ్యాటరీల సామర్థ్యం కల్గిన ఎస్‌టీ 2 వేరియంట్‌ల వాహనాలను విడుదల చేశారు. కర్ణాటక వ్యాప్తంగా 55 మంది డిస్ట్రిబ్యూటర్‌ల ద్వారా కొత్త వాహనాలను మార్కెట్‌లోకి తెచ్చామన్నారు. 11 ఆకర్షణీయమైన రంగులలో 5 వేరియంట్‌లు లభ్యమన్నారు. 2.2 కేడబ్ల్యుహెచ్ బ్యాటరీ 150 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు వీలుంటుందన్నారు. 2 గంటల చార్జింగ్‌తో సాధ్యమని వివరించారు. 3 లక్షల వాహనాలు విక్రయించామని కొత్త వేరియంట్‌లలో మరికొంత ఆధునీకరణ అనుసంధానం చేశామన్నారు. గరిష్టవేగం 70 కిలోమీటర్లుగా ఉందన్నారు. కిలోమీటరుకు సగటున 30పైసలు ఖర్చు కానుందన్నారు.



కొత్త వాహనాల విడుదలలో సౌరబ్ కపూర్, నితిన్ తనేజా

రామయ్య టెక్నాలజీ క్యాంపస్‌లో టెక్ ఫెస్టివల్

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పీణ్యాలోని రామయ్య టెక్నాలజీ క్యాంపస్‌లో ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ అప్లైడ్ సైన్సెస్ ఆధ్వర్యంలో టెక్ ఫెస్టివల్ జరిపారు. టీసీఎస్ డెలివరీ సెంటర్ ముఖ్యులు సునీల్ దేశ్‌పాండే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్, ఎలక్ట్రికల్ వాహనాలు, ఆధునాతన సాంకేతికంలో మరో మైలురాయి అని కొనియాడారు. విద్యార్థులు ఆధునికమైన పరిజ్ఞానాన్ని ప్రాజెక్టుల రూపంలో పొందాలని సూచించారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కులదీప్‌కుమార్ రైనా, రామయ్య టెక్నాలజీ క్యాంపస్ డీన్ డాక్టర్ జేవీ దేశాయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ నయనా ఎన్ పాటిల్ పాల్గొన్నారు. 800 ప్రాజెక్టుల రూపొందించగా 233 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు ప్రదానం చేశారు.



టెక్ ఫెస్టివల్ ప్రారంభంలో ప్రముఖులు

ఇంట్లో టీవీనే ఓ ప్రపంచం : శ్రద్ధాదాస్

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో టెలివిజన్ ఓ ప్రపంచమని ప్రముఖ దక్షిణాది హీరోయిన్ శ్రద్ధాదాస్ అభిప్రాయపడ్డారు. డిష్‌టీవీ స్మార్ట్‌ప్లస్‌ను బుధవారం నగరంలో లాంఛనంగా ప్రారంభించారు. డిష్‌టీవీ దేశవ్యాప్తంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అతిపెద్ద డీటీహెచ్ సేవలు సమకూరుస్తోంది. ఇండియన్ సినిమా అంటే బాలీవుడ్ ఎప్పుడూ ప్రముఖంగా ఉండేదని అయితే ఇటీవల ప్రాంతీయ భాషల సినిమాలు వేగం పెంచాయని, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నాయని కొనియాడారు. తెలుగు, తమిళం, మళయాళం, కన్నడ భాషల సినిమాలు ఆదరణ పొందుతున్నాయన్నారు. డిష్‌టీవీ స్మార్ట్‌ప్లస్ ద్వారా మరిన్ని ఎక్కువ సినిమాలను భిన్నమైన భాషలలో ఎంచుకునే విధానం ఉందన్నారు. ఓటీటీ, టీవీలను ఒకే గొడుగుకింద తీసుకొచ్చే డిష్‌టీవీ సరికొత్తగా ఉందన్నారు. డిష్‌టీవీ ఇండియా లిమిటెడ్ సీఈఓ మనోజ్ దోభాల్ మాట్లాడుతూ డిష్‌టీవీ ఎంటర్‌టైన్‌మెంట్‌లో కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకొస్తోందన్నారు. దేశవ్యాప్తంగా డిష్‌టీవీ స్మార్ట్‌ప్లస్‌తో మరింత మందికి వినోదం అందించనుందన్నారు. బిజినెస్ హెడ్ సుగతో బెనర్జీ సహా పలువురు పాల్గొన్నారు.



డిష్‌టీవీ స్మార్ట్‌ప్లస్ సేవల ప్రారంభంలో నటి శ్రద్ధాదాస్

బీజేపీ విజయం ఖాయం

మహదేవపుర, మే 15: దేశంలో నాల్గో విడత ఎన్నికల పోలింగ్ ముగిసిందని ఇప్పటికి అందిన సమాచారం మేరకు బీజేపీకి స్వల్ప సీట్ల మెజారిటీ సాధ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారని మాజీ మంత్రి అరవింద లింబావళి వెల్లడించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలో మహదేవపుర నియోజకవర్గంలో ఎన్నికల వేళ శ్రమించిన కార్యకర్తలు, ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపే సమావేశం గొరవగెరెలోని కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ దేశాన్ని సరైన దిశలో పాలించిన ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి కూడా పీఎం అవుతారన్నారు. ప్రజల ఆశీస్సులు ఖాయమన్నారు. సమావేశంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ అభ్యర్థి పీసీ మోహన్, స్థానిక ఎమ్మెల్యే మంజుళా, గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, పట్టణ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రముఖులు పాపణ్ణ, గణేశ్, మంజునాథ్, పిళ్ళప్ప, ఎల్ రాజేశ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి లింబావళిని సన్మానిస్తున్న నాయకులు

చిరుత సంచారంతో గ్రామస్థుల ఆందోళన

చింతామణి, మే 15: తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి మాదమంగల వద్ద చిటీవల చిరుత ఒకటి కనిపించడంతో భయపడిన గ్రామస్థులకు వెనువెంటే మాదమంగలకు అనుబంధమైన కోనపల్లిలో జింకను చిరుత వేటాడిన ఆనవాళ్లు లభ్యమయ్యాయి. జింక కళేబరం పక్కన చిరుత కాలి గుర్తులు స్పష్టంగా కనిపిస్తుండడంతో గ్రామస్తులలో భయం నెలకొంది. తాలూకాలోని మోటమాకలపల్లి అటవీప్రదేశానికి చెందిన కోనపల్లి గ్రామానికి చెందిన హరీశ్ పొలంలో బుధవారం తెల్లవారుజామున జింక వెనుకభాగాన్ని తిని మిగిలిన దేహాన్ని అక్కడే వదిలేసినట్టు గుర్తించారు. చిరుత వేటాడిన గుర్తులు స్పష్టంగా కనిపిస్తుండడంతో గ్రామస్థులలో ఆందోళన నెలకొంది. గతంలో చిరుతసంచారం గురించి పలువురు పశుకాపరులు అటవీశాఖ అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయింది. మోటమాకలపల్లి అటవీ సహాయక అధికారి సోమనాథ్ మాట్లాడుతూ జింకను ఏదో వన్యప్రాణి వేటాడిన మాట నిజమేనన్నారు. అక్కడ లభించిన గుర్తులు చిరుత కాలి గుర్తుల తరహాలో ఉండడంతో జింక కళేబరాన్ని అక్కడే ఉంచి చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా చిరుత సంచారం గురించిన నిజాలు వెలుగు చూస్తాయన్నారు.

ఘనంగా కోటె ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో కోటె ఆంజనేయస్వామి

శిడ్లఘట్ట, మే 15: శిడ్లఘట్ట పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన పురాణ ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవాలయ 29వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్వామి వారికి విశేషపూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. సుప్రభాత సేవ, రామతారక హోమం, గాయత్రి, నవగ్రహ హోమం, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం అనంతరం అలంకరణ నిర్వహించారు. సాయంత్రం పురవీధులలో స్వామివారి ముత్యాల పల్లకీ ఉత్సవం జరిగింది. ప్రధాన అర్చకులు నరసింహాచార్య నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. పల్లకీ ఉత్సవం సందర్భంగా ప్రతి ఇంట ముంగిటా భక్తులు హారతులు సమర్పించారు.

476 మందికి ఫెడరల్‌బ్యాంకు స్కాలర్‌షిప్‌లు

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఫెడరల్ బ్యాంకుకు అనుబంధమైన హోర్మిస్ మెమోరియల్ ఫౌండేషన్ 476మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. 2023-24 విద్యాసంవత్సరానికిగాను కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల విద్యార్థులను ఎంపిక చేసింది. వృత్తి విద్యాకోర్సులైన ఎంబీబీఎస్, బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్, నర్సింగ్, కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్, ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షల ద్వారా ఎంపిక చేసినట్టు వైస్ ప్రెసిడెంట్, సీఎస్ఆర్ ముఖ్యులు షాజి కేవీ బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకు ఫౌండర్ కేపీ హోర్మిస్ పేరిట విద్యార్థివేతనాలు ఇస్తున్నట్టు ప్రకటించారు.

సరళంగా భగీరథ జయంతి

శిడ్లఘట్ట, మే 15: జాతీయపండుగల నిర్వహణా సమితి, తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయంలో మహర్షి భగీరథ జయంతిని సరళంగా, భక్తిశ్రద్ధలతో ఆచరించారు. భగీరథుడి చిత్రపటానికి పూజలు చేశారు. పూర్వీకులకు ముక్తి కల్పించేందుకు గంగాదేవిని భూమిపైకి రప్పించిన ఘనత భగీరథుడిది. ఇందుకు ఎన్నో కష్టానష్టాలు ఎదుర్కొన్నారు. అందుకే ఎన్నో క్లిష్టమైన సమస్యలను ఎదుర్కోవడాన్ని నేటికీ భగీరథ ప్రయత్నంగా పేర్కొంటూ ఉంటారు. కార్యక్రమంలో భగీరథసంఘం గౌరవాధ్యక్షుడు నరసింహప్ప, జిల్లా కోశాధికారి ఎన్ కుమార్, ప్రముఖులు సీవీ లక్ష్మణ్‌రాజు, తాలూకా సాంఘిక సంక్షేమ అధికారి జగదీశ్, బి గ్రేడ్ తహసీల్దార్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యూరెర్ రాయబారిగా సౌరవ్‌గంగూలి

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యరంగానికి సంబంధించిన ఎలక్ట్రికల్ ఉత్పత్తుల సంస్థ జర్మనీ దేశానికి చెందిన బ్యూరెర్ తన సరికొత్త రాయబారిగా ప్రముఖ క్రికెటర్ సౌరవ్‌గంగూలిని నియమించింది. సంస్థ తాజాగా షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడే దేశంలో సిద్ధం చేసిన బ్లడ్ గ్లూకోజ్ మానిటర్ డివైజ్‌ను ఇటీవల విడుదల చేసింది. ఇందుకు సంబంధించి నగరంలో సంస్థ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ బ్యూరెర్ ఇండియా సంస్థ క్రమేపీ విస్తరించుకుంటోందన్నారు. ఆరోగ్య రంగంలో అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నట్టు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, మే 15: మండలకేంద్రాలైన పెనుకొండ, గోరంట్లలో గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీలకు ఈ నెల 20వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. గోరంట్ల పాఠశాలలో 3తరగతి ప్రవేశానికి 40సీట్లుకుగాను బీసీల కు రెండు, ఓసీ ఒకటి, ఎస్టీ 32, ఎస్సీ 5 సీట్లు ఉన్నాయన్నారు. గిరిజన బాలికల కోసం 4వతరగతిలో 36, ఐదులో 29, ఆరులో 7, ఏడులో 5, 8లో ఒకటి, తొమ్మిదో తరగతిలో ఎనిమిది సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పాఠశాలలో చేరేవారు ఇతర వివరాలకోసం సెల్ ఫోన్ నంబరు 9398624224ను సంప్రదించాలన్నారు. అలాగే పెను కొండ పాఠశాలలో నాలుగో తరగతిలో 35, ఐదులో 31, ఆరులో 32, ఏడులో 11, ఎనిమిదిలో 8, తొమ్మిదో తరగతిలో 18సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందుకోసం ఇతర వివరాలకు సెల్ ఫోన్ నంబరు 8332037233కు సంప్రదించాలని పెనుకొండ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు.

హిందూపురంలో తాగునీటికి కటకట

హిందూపురం అర్బన్, మే 15: వేసవి కాలం ముగుస్తోంది. హిందూపురంలో మాత్ర నీటి సమస్య తీరలేదు. పట్టణ వ్యాప్తంగా మునిసిపాలిటీ సరఫరా చేసే నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని కొనుక్కొని వాడుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికే ఆకాశాన్నంటే నిత్యవసరాల ధరలతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికి తోడు తాగునీటి కోసం నెలకు రూ.1500 అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. దీంతో కుటుంబం ఖర్చు మరింత పెరిగి తీవ్ర ఇబ్బందు లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వేసవి కాలం వచ్చిందంటే హిందూపురంలో నీటి ఎద్దడి ఎక్కువగా కనిపించేది. కానీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో రూ.194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో ఆ సమస్య కనుమరుగైంది అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ పట్టణంలో నీటి సమస్య అధికమైంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు సక్రమంగా సరఫరా అయితే టీడీపీకి, బాలకృష్ణకు పేరు వస్తుందనే భావనతో పైపులు మరమ్మతులకు వచ్చినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా వైసీపీ పాలకులు సరిగా స్పందించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు కొంతమంది మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వల్ల పట్టణంలో నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉందన్న విమర్శలూ లేకపోలేదు. ముఖ్యంగా పలువురు ఫిట్టర్లు, వాటర్‌మన్‌లు నిర్వాకం వల్ల నీటి సరఫరా విభాగంలో పెద్ద ఎత్తున అక్రమ కనెక్షన్‌ల వ్యవహారం నడుస్తోందని మునిసిపల్ శాఖలోని కొంత మంది చర్చించుకోవడం విశేషం. కొన్ని అపార్టుమెంట్‌లకు, హోటళ్లకు అధికంగా నీరు సరఫరా ఏర్పాట్లు ఉండడంతో ప్రజలకు నీరు సక్రమంగా అందడం లేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా పలువురు కౌన్సిలర్లు జులుం ప్రదర్శించడం వల్ల అక్రమ కనెక్షన్‌లు విచ్చలవిడిగా వెలిసిన ట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి పన్నులు సక్రమంగా చెల్లించే వారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో వారానికి కనీసం రెండు సార్లు నీరు అందించాల్సి ఉంది. కానీ గొల్లపల్లి నుంచి నీరు సరఫరా కావడం లేదనే నెపంతో ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో అవసరానికి నీరు కొనాల్సి వస్తోంది. ఇప్పుడు పట్టణంలో 15 రోజులుగా నీటి సరపరా నిలిచిపోయి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ నీటి సరఫరా సిబ్బందిని అడిగితే గొల్లపల్లి రిజర్వియర్ వద్ద విద్యుత్ బోర్డులో మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు ఇంకా వారం రోజులు పట్టవచ్చని చెబుతున్నారు. దీంతో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధార పడక తప్పదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్య ఉంది

- బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ డీఈఈ

గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి సరఫరా ఆగింది. అక్కడ విద్యుత్ సరఫరాలో మరమ్మతుల కారణంగా హిందూపురానికి నీరు అందించలేకపోతున్నాం. మూడు రోజుల నుంచి సిబ్బంది అన్ని విధాలా ప్రయత్నాలు చేశారు. కానీ మరమ్మ తులు కావడం లేదు. బుధవారం విద్యుత్‌శాఖ అధికారులను కూడా పిలిచాం. వారి సహకారంతో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా మూడు రోజులు సమయం పట్టవచ్చు.

నీటి సరఫరాకు రెండు రోజులు అంతరాయం

● మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్

హిందూపురం పట్టణ ప్రాంతంలో మునిసిపల్ నీరు అందించే విషయంలో అంతరాయం ఏర్పడినట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ ఎస్‌కేడీ వాటర్ లిఫ్టింగ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్, ప్యానల్ బోర్డులో మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగవచ్చన్నారు. ఇప్పటికే మునిసపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారన్నారు. వాటిని సరిచేసేందుకు రెండు రోజల సమయం పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.